నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, ఆదివారం 8 జూన్ 2025 | RANGAREDDY



మొయినాబాద్ : ఎన్కేపల్లిలోని సర్వేనంబర్ 180లోని 100 ఎకరాలను ప్రభుత్వం గోశాల కోసం తీసుకోవాలని యత్నిస్తున్న నేపథ్యంలో శనివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆ భూములను సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి.. వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.



ప్రారంభమైన అంగన్‌వాడీ భవనం

నమస్తే ఎఫెక్ట్

# అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కేశంపేట, జూన్ 7 : మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనంపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వేగంగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏప్రిల్ 21న ప్రచురితమైన 'నిధుల్లేక.. ఆగిన నిర్మాణం' కథనానికి పాలకులు, అధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేయగా శనివారం దానిని షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రారంభించారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు రామకృష్ణ, రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఉదయ, అంగన్‌వాడీ కార్యకర్త భారతి, ఆయా నిర్మల పాల్గొన్నారు.

## కబ్జా కోరల్లో..
# చెరువులు, కుంటలు



బ్రాహ్మణపల్లి చెరువులోకి నీరొచ్చే ప్రధాన కాల్వను మూసేసిన ఒక రియల్‌ఎస్టేట్ సంస్థ

## రంగారెడ్డి జిల్లాలో ఆగని ఆక్రమణలు

- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఎన్‌ఓసీలు తీసుకుంటూ ప్లాట్లుగా మార్చి విక్రయాలు
- జిల్లాలో 2,132 చెరువులు, కుంటలు
- వాటిలో సగానికి పైగా కబ్జా ఆరోపణలే..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఓఆర్ఆర్ లోపలి గ్రామాల్లో రాత్రికి రాత్రే చెరువులు, కుంటలను పూడ్చేస్తున్న రియల్టర్లు

రంగారెడ్డి, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో చెరువులు, కుంటలు, ఇరిగేషన్ కాల్వలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్డుకు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని చెరువులు, కుంటల ఆక్రమణ పెద్ద ఎత్తున జరుగుతున్నది. చెరువులు, కుంటల పక్కన ఉన్న పట్టా భూములు ఉన్న వారు రాత్రికి రాత్రే మట్టితో పూడ్చి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అదేవిధంగా మరికొన్ని చోట్ల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అధికారుల అండదండలతో చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లోనూ గుట్టుచప్పుడు కాకుండా ఎల్‌వోసీలు తీసుకొచ్చి ప్లాట్లుగా మార్చి ప్రజలకు విక్రయిస్తున్నారు. అలాగే, ఔటర్ లోపలి మున్సిపాలిటీలైన తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్ తదితర మున్సిపాలిటీల్లోని చెరువులు, కుంటలు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. ఈ వ్యవహారంపై రైతులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రధాన కాల్వ కబ్జా.. నీరు లేక ఎండిపోతున్న బ్రాహ్మణపల్లి చెరువు

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న బ్రాహ్మణపల్లి చెరువులోకి నీరొచ్చే ప్రధాన కాల్వను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయడంతో.. నాలుగైదు చెరువులకు నీరందడం లేదు. బ్రాహ్మణపల్లి చెరువు కూడా ఎండిపోతున్నది. అదేవిధంగా పక్కనే ఉన్న అరుంధతినగర్ పరిసరాల్లో ఉన్న చెరువును సైతం ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు. ఇంజాపూర్‌లోఉన్న గూడెంకుంట, మన్నెగూడలోని ఎర్రకుంట, ఎంఎం కుంటలోని కొత్తచెరువు కబ్జాకు గురవుతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు.

### జిల్లాలో 2,132 చెరువులు, కుంటలు..

జిల్లాలో 2,132 చెరువులు, కుంటలున్నాయి. ఇటీవల వర్షాలు కురువకపోవడంతో అవి ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. రాత్రి వేళల్లో వాటిలో మట్టి నింపి పూడ్చివేస్తున్నారు. మరికొన్ని చోట్ల చెరువుల్లోకి నీరొచ్చే ఇరిగేషన్ ప్రధాన కాల్వలూ కబ్జాకు గురై చెరువులకు నీరొచ్చే దారులు మూసుకుపోతున్నాయి.

### ఇరిగేషన్ కాల్వలు కూడా..

జిల్లాలోని చెరువులు, కుంటలకు నీరందించే ఇరిగేషన్ కాల్వలు కూడా ఎక్కడికక్కడ కబ్జాకు గురవుతున్నాయి. అనాజ్‌పూర్ సమీపంలోని ఇందిరాసాగర్ చెరువుకు ఆదిబట్ల నుంచి మంగల్‌పల్లి, శేరిగూడ, ఇబ్రహీంపట్నం, నాగన్‌పల్లి గ్రామాల మీదుగా పులిందర్ వాగు నుంచి నీరందుతుండగా పలుచోట్ల కబ్జాకు గురైంది. బ్రాహ్మణపల్లి చెరువులోకి నీరొచ్చే ప్రధాన కాల్వను పూడ్చి దానిపైనే నిర్మాణాలు చేపట్టారు. చేవెళ్ల మండలంలోని చందనవెల్లి నుంచి రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల నుంచి ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు నీరొచ్చే ప్రధాన రాచకాల్వ కూడా ఎక్కడికక్కడ ఆక్రమణకు గురైంది. రియల్‌ఎస్టేట్ సంస్థలు రాచకాల్వను కబ్జాచేసి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నాయి. రాచకాల్వపై ఎలాంటి అనుమతులు లేకుండానే ఓ విద్యాసంస్థ బ్రిడ్జిని సైతం నిర్మించింది. సుమారు 1250 హెక్టార్ల ఆయకట్టుకు నీరందించే ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు నీరు వచ్చేందుకు ఈ కాలువే ప్రధానమైంది. ఈ కాల్వ కబ్జాకు గురికావడంతో చెరువు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. రావిర్యాల పెద్దచెరువులోకి నీరొచ్చే ప్రధాన కాల్వలూ ఆక్రమణకు గురయ్యాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఆయా రియల్‌ఎస్టేట్ సంస్థలతో కుమ్మక్కై ఆక్రమణలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలున్నాయి. చెరువులు, కుంటల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా చర్యలు శూన్యమేనని వారు మండిపడుతున్నారు.

### గత బీఆర్ఎస్ హయాంలో మరమ్మతులు చేసినా..

రాచకాల్వ పలు చోట్ల అక్రమాలకు గురవుతున్నది. చేవెళ్ల మండలంలోని చందనవెల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్దచెరువు వరకు ఉన్న ఈ కాల్వ ఎక్కడికక్కడే కబ్జాకు గురైంది. దీంతో రాచకాల్వ నుంచి ఇబ్రహీంపట్నం చెరువుకు నీరు రావడం ఆగిపోయింది. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి రాచకాల్వకు మరమ్మతులు చేపట్టగా.. ఇటీవల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎక్కడికక్కడ కబ్జా చేయడంతో కాల్వ పూర్తిగా మూసుకుపోయింది.

### మాయమవుతున్న మాసబ్‌చెరువు..

మాసబ్‌చెరువు క్రమంగా మాయవుతున్నది. ఈ చెరువు కబ్జాపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వచ్చి పరిశీలించారు. అప్పటికే రియల్‌ఎస్టేట్ వ్యాపారులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో ఆదిత్య నగర్ పేరిట వెంచర్ చేసి ప్లాట్లను చేసి విక్రయించారు. అలాగే, ఈ చెరువు బఫర్‌జోన్‌లోనూ యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు పెద్దచెరువు, పెద్దఅంబర్‌పేట ఈదుల చెరువులు సైతం కబ్జాకు గురయ్యాయి. యాచారం మండలంలోని మొగుళ్లవంపు మొద్దులకుంట, కడ్తాల్‌లోని వంపుగూడ చెరువు, మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని పడమటి చెరువును ఏకంగా కబ్జాచేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



నీరులేక ఎండిపోతున్న బ్రాహ్మణపల్లి చెరువు



అసంపూర్తిగా ఉన్న లేమామిడి– కాకునూరు గ్రామాల మధ్య ఉన్న వంతెన

# వంతెన..అంతేనా?

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం.. అర్ధాంతరంగా ఆగిన పనులు

- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మండల వాసులు
- బీఆర్ఎస్ హయాంలో కాకునూరు-లేమామిడి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5.33 కోట్లు విడుదల
- చురుగ్గా సాగిన పనులు..
- అప్పుడే అసెంబ్లీ ఎన్నికల కోడ్.. మారిన ప్రభుత్వం..
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

**మండలంలోని కాకునూరు-లేమామిడి గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి గ్రహణం వీడడం లేదు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న లేమామిడి, కాకునూరు, నిర్దవెల్లి గ్రామాల ప్రజలకు.. పాలకుల తీరుతో అది ఆశగానే మారుతున్నది. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపేయడంతో వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో? అంటూ నిట్టూరుస్తున్నారు. కేవలం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి వర్షం వచ్చి వాగు పారిందంటే 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలని కోరుతున్నారు. -కేశంపేట, జూన్ 7**

మండలంలోని లేమామిడి, కాకునూరు గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 5.33 కోట్ల నిధులను మంజూరు చేయడంతో.. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ కోటేశ్వర్‌రెడ్డి ఆ పనులను దక్కించుకున్నాడు. బీఆర్ఎస్ హయాంలో పనులు వేగంగా జరుగగా.. అప్పుడే ఎన్నికల కోడ్ రావడం.. తదనంతరం ప్రభుత్వం మారడంతో ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పెద్ద మొత్తంలో డబ్బులను పెట్టి పనులను చేపట్టినా బిల్లులు రాకపోవడంతో ఆ కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేసినట్లు ప్రచారం జరుగుతున్నది.

### వాగు పారితే రాకపోకలు బంద్..

వర్షాకాలంలో వానలు పడి వాగు పారితే లేమామిడి-కాకునూరు, నిర్దవెల్లి-కాకునూరు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోతాయి. నిర్దవెల్లి నుంచి కాకునూరుకు వెళ్లాలంటే కేవలం 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. వాగు పారుతున్న సమయంలో నిర్దవెల్లి నుంచి కాకునూరుకు వెళ్లాలంటే లేమామిడి, కేశంపేట, వయా కాకునూరుకు వెళ్లాల్సి ఉంటుందని.. తద్వారా 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనను నిర్మిస్తే కాకునూరు, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, ఇప్పలపల్లి వయా షాద్‌నగర్ రాకపోకలకు ఈ మార్గం మరింత సులభతరంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు.

### కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశాడు..



బీఆర్ఎస్ హయాంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఎంతో సంతోషించాం. అయితే, ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆ పనులను మధ్యలోనే కాంట్రాక్టర్ నిలిపేశాడు. మా గ్రామం నుంచి కాకునూరుకు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. వాగు పారుతున్న సమయంలో 12 కిలోమీటర్ల వరకు అదనంగా వెళ్లాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి. - శ్రీనివాస్, కాకునూరు

### పాలకులు మారితే పనులను ఆపుతారా..?



గత కేసీఆర్ పాలనలో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో పనుల్లో వేగం పుంజుకున్నా ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వాగుపై వంతెన నిర్మించకపోవడంతో పవిత్రమైన మహాలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కూడా ఇబ్బందులు తప్పడంలేదు. పాలకులు మారితే పనులను ఆపడం సరికాదు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ పనులను ప్రారంభించాలి.

- కోటేశ్వర్, మాజీ ఎంపీటీసీ, కాకునూరు

### నోటీసులు అందజేశాం..

వంతెన పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులను నిలిపేసిన సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశాం. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతోనే పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ చెప్పారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నాం.

- హేమంత్, ఇన్‌చార్జి డీఈ, షాద్‌నగర్

## 24 బార్లకు 3,520 దరఖాస్తులు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో నోటిఫికేషన్ జారీచేసిన 24 బార్లకు 3,520 దరఖాస్తులు వచ్చినట్లు ఆబ్కారీ శాఖ కమిషనర్ హరికిరణ్ వెల్లడించారు. వీటితోపాటు ఇతర జిల్లాలోని నాలుగు బార్లకు 148 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. మొత్తం 28 బార్లకు 3,668 దరఖాస్తులు వచ్చాయి. వాటి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6తో ముగిసింది. దీంతో శుక్రవారం పెద్ద ఎత్తున మద్యం వ్యాపారులు బార్ల కోసం దరఖాస్తు చేయడానికి ఆబ్కారీ కార్యాలయాల వద్ద బారులు తీరారు. జీహెచ్ఎంసీ మినహా ఇతర జిల్లాలైన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో నాలుగు బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. ఒక జీహెచ్ఎంసీ పరిధిలోనే 24 బార్లకు దరఖాస్తుల ద్వారా ఆబ్కారీ శాఖకు రూ.32.68కోట్ల ఆదాయం సమకూరగా, మొత్తం 28 బార్లకు రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆబ్కారీ శాఖ వెల్లడించింది. ఈనెల 13న బార్లకు సంబంధించిన లక్కీడ్రా తీయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## గ్రేటర్‌లో కొత్త ఆటోలకు అనుమతి



సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటోలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతించింది. అందులో భాగంగా కొత్తగా 20,000 ఎలక్ట్రిక్ ఆటోలు, 10,000 ఎల్‌పీజీ ఆటోలు, 10,000 సీఎన్‌జీ ఆటోలకు అనుమతినిచ్చింది. డీజిల్, పెట్రోల్ వాహనాలకు సంబంధించి ఆటోలకు రెటిరోఫిట్మెంట్ చేసి వాటి ఇంజన్లను ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్‌పీజీలుగా మార్చుకునేందుకు 25,000 ఆటోలకు అనుమతిస్తూ జీవో జారీ చేసింది.

# నిద్రలో.. నిఘా



- ఇబ్రహీంపట్నంలో పెరిగిపోతున్న చైన్‌స్నాచింగ్, అసాంఘిక కార్యకలాపాలు, చోరీలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ గాలికి..
- పట్టించుకోని పోలీసు అధికారులు

**ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమంటూ పోలీసుఅధికారులు ప్రకటనలు ఇవ్వడం మనం వింటున్నాం. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిద్రపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడూ చెక్ చేస్తూ వాటి నిర్వహణ చూసేవారు లేక గ్రామాలు, పట్టణాల్లో దొంగతనాలు పెరుగు తున్నాయన్న ఆరోపణలున్నాయి. పోలీసులూ ఆ దిశగా ఆలోచించడం లేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి.**

- ఇబ్రహీంపట్నం, జూన్ 7

గత ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో చాలామంది ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించుకున్నారు. వాటితో చాలావరకు నేరాలను నియంత్రించగలిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలపై పోలీసులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతోపాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలున్నాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గత పదేండ్లుగా దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాలు, వాటికి సంబంధించిన హార్ట్ డిస్క్‌లు తదితరాలను ఏర్పాటు చేయించారు. సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్ల పదవీకాలంలో సీసీ కెమెరాలతో నేరాల అదుపుకు కృషి చేశారు. ప్రస్తుతం సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. దీంతో సీసీ కెమెరాల నిర్వహణకు పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పేర్కొంటూ వాటి నిర్వహణను గాలికొదిలేశారు.

### పెరిగిపోతున్న నేరాలు..

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరిగిపోతున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవటంతో దొంగలు సులభంగా తప్పించుకుంటున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ బోర్ల కేబుళ్లను కట్ చేసుకుపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగిలించడం, ఇండ్లలో ఎవరూ లేని సమయంలో డబ్బు, బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తస్కరిస్తున్నారు.

### రోజుకో గొలుసు దొంగతనం

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలు (చైన్ స్నాచింగ్) పెరిగిపోతున్నాయి. వాటిని అదుపు చేయాల్సిన పోలీసులు పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కొహెడ ప్రాంతంలో ఇటీవల జరిగిన గొలుసు చోరీ మరువకముందే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఇటీవల తెల్లవారుజామున కూరగాయల మార్కెట్ నుంచి బస్టాండ్‌కు వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దుండగులు మూడు తులాల గొలుసును దోచుకెళ్లారు. ఇబ్రహీంపట్నంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గొలుసు చోరీలు చోటుచేసుకుంటున్నా పోలీసులు చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. వ్యవసాయ పొలాల వద్ద పనులు చేసుకుంటున్న మహిళలు, పశువులు మేపుతున్న మహిళలను టార్గెట్‌గా చేసి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతు చేయించాలి



గ్రామాల్లో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సీసీ కెమెరాలు లేకపోవడంతో గ్రామాల్లో నేరాలు పెరిగిపోయే ప్రమాదం ఉన్నది. పోలీసు అధికారులు స్పందించి వాటికి త్వరగా మరమ్మతులు చేయించాలి.

– బాలుగౌడ్, రాయపోల్

### చర్యలు తీసుకుంటాం



సీసీ కెమెరాల నిర్వహణను గతంలో ప్రజాప్రతినిధులు చూసుకునేవారు. ప్రస్తుతం కొన్ని చోట్ల సీసీ కెమెరాల పనితీరు సరిగ్గా లేదు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పలుచోట్ల మొరాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటి నిర్వహణ కోసం తగిన చర్యలు తీసుకుంటాం.

– కేపీవీ రాజు, ఏసీపీ